చంద్రయాన్-3 ద్వారా కొత్త విషయాలు : శాస్త్రవేత్త రామకృష్ణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

చంద్రయాన్-3 ద్వారా చంద్రుడిపై నూతన పరిశోధనలు నిర్వహిస్తారని, ప్రపంచానికి కొత్త విషయాలు చెబుతామని ఇస్రో రిటైర్డ్ సీనియర్ శాస్త్రవేత్త రామకృష్ణ అన్నారు. చంద్రయాన్-3 లాంచ్ నేపథ్యంలో హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ప్రోగ్రామ్ ఆవిష్కరించారు. ప్లానిటరీ సొసైటీ ఆఫ్ ఇండియా డైరెక్టర్ ఎన్ శ్రీరఘునందన్ కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తన 38 సంవత్సరాల సర్వీసులో ఇస్రో అనేక పరిశోధనలు జరిపి విజయవంతమైన ప్రయోగాలు చేసిందన్నారు. భూమిపై మానవ మనుగడ ప్రశ్నార్థకంగా మారిన క్రమంలో చంద్రయాన్-3 ద్వారా చంద్రునిపై నివాసం తదితర అంశాలపై పరిశోధనలు జరుగుతాయని తెలిపారు. చంద్రునిపై దక్షిణ ధ్రువంలోకి ఈ రాకెట్‌ను ప్రయోగిస్తున్నామని, రోవర్ ద్వారా అనేక విషయాలను వెలుగులోకి తీసుకొస్తామని చెప్పారు. ఈ సమావేశంలో ఒయు జియో ఫిజిక్స్ రిటైర్డ్ హెచ్‌ఓడీ ప్రొఫెసర్ జి రాందాస్, కెమిస్ట్రీ విభాగం ప్రొఫెసర్ కె.వెంకటేశ్వర్‌రావు, సెంటర్ ఫర్ స్పేస్ మెడిసిన్ నిపుణులు డాక్టర్ విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో మూడు శాతం పెరిగిన రిజిస్ట్రేషన్లు

ప్రజాశక్తి-హైదరాబాద్

జూన్ నెల హైదరాబాద్‌లోని ఆస్తుల రిజిస్ట్రేషన్లు మూడు శాతం పెరిగిందని రియాల్టీ కన్సల్టెంట్ సంస్థ నైట్ ఫ్రాంక్ తెలిపింది. దీంతో 5,566 నివాస ప్రాపర్టీల రిజిస్ట్రేషన్లు నమోదయ్యాయి. వీటి మొత్తం ఆస్తుల విలువ 2 శాతం పెరిగి రూ.2,898కోట్లుగా ఉంది. హైదరాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి, సంగారెడ్డి అనే నాలుగు జిల్లాలను ఈ రిపోర్ట్ పరిధిలోకి తీసుకుంది. గడిచిన జూన్‌లో రూ.25-50 లక్షల పరిధిలో అత్యధికంగా 52 శాతం ఆస్తులు రిజిస్ట్రర్ అయ్యాయి.





ఢిల్లీ పబ్లిక్ స్కూల్

యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

- వామపక్ష విద్యార్థి సంఘాల నాయకుల డిమాండ్
- నారాయణగూడ చౌరాస్తాలో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఢిల్లీ పబ్లిక్ స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరితే అక్రమంగా అరెస్టు చేస్తారా అంటూ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. బుధవారం చేపట్టిన బంద్ సందర్భంగా పలు జిల్లాల్లో విద్యార్థి సంఘాల నాయకులను పోలీసులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. అరెస్టులు, లాఠీచార్జీకి నిరసనగా గురువారం రాష్ట్ర వ్యాప్తంగా వామపక్ష విద్యార్థి సంఘాలు ఆందోళన చేశాయి. అందులో భాగంగా హైదరాబాద్ నారాయణగూడ చౌరస్తాలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వామపక్ష విద్యార్థి సంఘాల రాష్ట్ర నేతలు టి నాగరాజు, ఆర్ఎల్ మూర్తి(ఎస్ఎఫ్ఐ), పుట్టా లక్ష్మణ్ (ఎఐఎస్ఎఫ్), మహేష్, ఎస్ నాగేశ్వరరావు, రామకృష్ణ (పిడిఎస్‌యు), మల్లేష్ (ఎఐడిఎస్ఒ), గవ్వ వంశీధర్ రెడ్డి (ఎఐఎస్ బి) తదితరులు మాట్లాడారు.

టి నాగరాజు మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రభుత్వ విద్యారంగం దుస్థితి ఏమిటో సాక్షతూ సిఎం కెసిఆర్ మనుమడే చెప్పాడని, అయినా.. రాష్ట్ర ప్రభుత్వం నిధులు ఇచ్చి అభివృద్ధి చేయడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. బిఆర్ఎస్ నేతల ధర్నాలు, ఆందోళనలకు బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు.. సమస్యలపై పోరాడే వారిని బట్టలు చింపి, బూతులు తిడుతూ అక్రమంగా అరెస్టు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్ఎల్ మూర్తి మాట్లాడుతూ.. వెంటనే రాష్ట్రంలో ఫీజు నియంత్రణ చట్టం తీసుకురావాలని, ప్రభుత్వ విద్యారంగ సమస్యలు పరిష్కారించాలని కోరారు. ఖమ్మంలో ప్రయివేటు రౌడీలతో విద్యార్థి నేతలపై దాడి చేయించిన ఢిల్లీ పబ్లిక్ స్కూల్ యాజమాన్యాన్ని అరెస్టు చేసి, పాఠశాల అనుమతి రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పుట్టా లక్ష్మణ్ మాట్లాడుతూ.. సమస్యలు పరిష్కారించకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శులు డి కిరణ్, కె అశోక్ రెడ్డి, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు లెనిన్, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర యూనివర్శిటీల కన్వీనర్ రెహమాన్, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి జి నరేష్, రాష్ట్ర ఉపాధ్యక్షులు జి క్రాంతి, పిడిఎస్‌యు రాష్ట్ర సహాయ కార్యదర్శి గడ్డం శ్యామ్, ఎఐడిఎస్ఒ హైదరాబాద్ జిల్లా నాయకులు వెంకటేష్, సృజన్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల ఎదుట విద్యార్థి సంఘాల ఆందోళన
విద్యాశాఖ అధికారి సోమశేఖర్ శర్మ సందర్శన.. పాఠశాల సీజ్

అనుమతులు లేకుండా నడపడమే కాకుండా, నిబంధనలు పాటించని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ఎదుట గురువారం వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు ఆందోళనకు దిగారు. ఈ ఆందోళనతో ఖమ్మం జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖర్ శర్మ.. ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌ను సందర్శించి అనంతరం సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు తుడుం ప్రవీణ్, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఇటీకాల రామకృష్ణ, పిడిఎస్‌యు రాష్ట్ర కార్యదర్శి నామాల ఆజాద్, జిల్లా కార్యదర్శి మస్తాన్, ఎఐవైఎఫ్ నానబాల రామకృష్ణ, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి షేక్ బషీరుద్దీన్, ఎన్ఎఫ్ఐడబ్ల్యు జిల్లా అధ్యక్షులు పోటు కళావతి, పిఒడబ్ల్యు రాష్ట్ర కార్యదర్శి శిరోమణి మీడియాతో మాట్లాడారు. నిబంధనలకు విరుద్ధంగా ఏ విద్యాసంస్థలు నడిచినా ఊరుకునేది లేదన్నారు. ఢిల్లీ పబ్లిక్ స్కూల్ యాజమాన్యం బెదిరింపులకు పాల్పడుతూ రౌడీల రక్షణలో ఇన్ని రోజులు పాఠశాలను నడిపిస్తూ వచ్చారని తెలిపారు. పాఠశాలను సీజ్ చేసిన విద్యాశాఖ అధికారులు చిత్తశుద్ధితో వ్యవహరించాలని కోరారు. కార్యక్రమంలో విద్యార్థి యువజన సంఘాల నాయకులు మడుపల్లి లక్ష్మణ్, నాగుల మీరా, యువరాజు, శివ, చందూలాల్, వీరేందర్, సాయి, దీపిక, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ సిబ్బంది సమస్యలను పరిష్కరించాలి

- సమ్మెను విరమింపజేయాలి
- సిఎం కెసిఆర్‌కు తమ్మినేని లేఖ


ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గ్రామపంచాయతీ సిబ్బందికి సంబంధించిన న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని, తద్వారా వారి సమ్మెను విరమింపజేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావుకు గురువారం ఆయన లేఖ రాశారు. రాష్ట్ర వ్యాప్తంగా 12,769 గ్రామ పంచాయతీల్లో 50 వేల మంది గ్రామపంచాయతీ సిబ్బంది స్వీపర్లుగా, పారిశుధ్య కార్మికులుగా, పంప్ ఆపరేటర్లుగా, ఎలక్ట్రీషియన్లుగా, డ్రైవర్లుగా, కారోబార్లుగా, బిల్ కలెక్టర్లుగా వివిధ కేటగిరిల్లో పనిచేస్తున్నారని తెలిపారు. వారంతా ఎస్‌సి, ఎస్‌టి, బలహీన వర్గాలకు చెందిన పేదలేనని పేర్కొన్నారు. వారి ఆరోగ్యాలనూ లెక్కచేయకుండా గ్రామాలను శుభ్రం చేస్తూ ప్రజల ఆరోగ్యాలను కాపాడుతున్నారని వివరించారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న వారి సమస్యలను పరిష్కరించాలంటూ అధికారులకు సమ్మె నోటీసును ఇచ్చారని గుర్తు చేశారు. అయినా ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. దీంతో జెఎసి ఆధ్వర్యంలో ఈనెల ఆరు నుంచి రాష్ట్ర వ్యాప్త సమ్మె చేస్తున్నారని తెలిపారు. పారిశుధ్య పనులన్నీ నిలిచిపోయి గ్రామాలు చెత్తా, చెదారం, దుర్గంధంతో కంపుకొడుతున్నాయని పేర్కొన్నారు. వర్షాకాలం కాబట్టి అంటువ్యాధులు ప్రబలే ప్రమాదముందని వివరించారు. గత్యంతరం లేక స్వయంగా సర్పంచ్‌లే చెత్త సేకరణ లాంటి పనులు చేసే దుస్థితి వచ్చిందని తెలిపారు. ప్రజల ఇబ్బందులను గమనించి కొన్ని గ్రామపంచాయతీ పాలకమండళ్లు వారి న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని తీర్మానాలు చేస్తున్నాయని పేర్కొన్నారు. ఒక్కరి పేరుతో వచ్చే రూ.8,500ల అతి తక్కువ వేతనాన్ని ఇద్దరు ముగ్గురు సిబ్బంది పంచుకుంటున్నారని వివరించారు. ఈ క్రమంలో తక్కువ వేతనంతో, అత్యంత దీనస్థితిలో వారు బతుకుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వారికి కనీస వేతనం, పిఎఫ్, ఆరోగ్య బీమా, గ్రాట్యూటీ, సెలవులు, గుర్తింపు కార్డుల సౌకర్యం లేదని తెలిపారు. చనిపోయిన సిబ్బందికి కనీసం అంత్యక్రియల ఖర్చు, ఆర్థిక సహాయం కూడా అందించడంలేదని పేర్కొన్నారు. ఈ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించి వారికి న్యాయం చేస్తుందని ఎంతో ఆశతో చాలా కాలంగా ఎదురుచూస్తున్నారని సిఎంకు తెలిపారు. సమస్యల తీవ్రత రీత్యా రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే జెఎసి నాయకులతో చర్చలు జరిపి, వారి న్యాయమైన సమస్యలను పరిష్కరించి, సమ్మెను విరమింపజేయాలని తమ్మినేని కోరారు.

10, 11 గంటలు కూడా కరెంట్ ఇవ్వడం లేదు

- రేవంత్ ఏం అన్నారో తెలుసుకోకుండా ధర్నాలా?
- ఇకనైనా నాటకాలు కట్టిపెట్టండి • ఎంపి కోమటిరెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



మంత్రి కెటిఆర్ 24 గంటల ఉచిత కరెంట్ ఇస్తున్నామంటున్నారని, కానీ 10, 11 గంటలకు మించి రైతులకు కరెంట్ రావడం లేదని భువనగిరి ఎంపి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. గురువారం యాదాద్రిభువనగిరి మండలంలోని బండసోమారం సబ్‌స్టేషన్‌ను ఆయన సందర్శించారు. సబ్ స్టేషన్ లాగ్‌బుక్ వివరాలను పరిశీలించారు. అక్కడ పని చేస్తున్న వారి నుంచి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగులకు ఇంకా జీతాలు రాలేదని, బండ సోమవారం సబ్ స్టేషన్‌లో పని చేస్తున్న బాల నర్సయ్యను ఎలా బతుకుతున్నారని అడిగితే "అప్పు చేసి బతుకుతున్నాం" అని చెప్పాడని అన్నారు. కెసిఆర్, కెటిఆర్ ఒకసారి బాల నర్సయ్య లాంటి వారి బాధలు వినాలన్నారు. రైతులకు 24 కరెంట్ అందడంలేదని, బండ సోమవారం సబ్ స్టేషన్ బుక్‌లో అన్ని వివరాలూ ఉన్నాయని, బిఆర్ఎస్ వాళ్లు పని లేక ధర్నాలు చేస్తున్నారని విమర్శించారు. ఇసుక మాఫియా, ల్యాండ్ మాఫియాతో బిఆర్ఎస్ నాయకులు కోట్లు సంపాదించారని, డబ్బులు ఇచ్చి ధర్నాలు చేయించారని ఆరోపించారు. 24 గంటల కరెంట్ అంటున్న మంత్రి కెటిఆర్‌ను బండ సోమవారం సబ్ స్టేషన్ నుంచి ప్రశ్నిస్తున్నానని అన్నారు. 10, 11 గంటలకు మించి రైతులకు కరెంట్ ఇవ్వడం లేదని, మధ్యలో కట్ కూడా అవుతోందనారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో తొమ్మిది గంటల ఉచిత కరెంట్ అందించామని గుర్తు చేశారు. దేశంలో ఉచిత కరెంట్ తీసుకొచ్చిందే కాంగ్రెస్ పార్టీ అని తెలిపారు. కాంగ్రెస్‌కు పెరిగిన ప్రజాదరణ చూసి ఓర్వలేక, ప్రజలను మోసం చేయాలనే ఉద్దేశంతో బిఆర్ఎస్ నాటకాలు ఆడుతోందనారు. బిఆర్ఎస్ ధర్నాను అడ్డుకున్నారని మహబూబ్‌నగర్‌లో సబ్ మెజిస్ట్రేట్ భర్తపై దాడి చేశారని, ఆఖరికి కానిస్టేబుల్ పైనా దాడికి పాల్పడ్డారని, ఇదెక్కడి న్యాయం అని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి ఏం మాట్లాడారో తెలియకుండా ధర్నాలు చేస్తారా? ప్రజలను ఇబ్బంది పెడతారా? నాటకాలు ఇకనైనా ఆపండి అని హెచ్చరించారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో 24 గంటల ఉచిత కరెంట్ హామీని పెడతామని రాక్రే చెప్పారన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు పంజాల రామాంజనేయులు గౌడ్, పోత్నక్ ప్రమోద్ కుమార్, నానం కృష్ణ గౌడ్, గోదా శ్రీనివాస్ గౌడ్ తదితరులు ఉన్నారు.

పోలీస్ శాఖతో బిఒబి ఒప్పందం

ప్రజాశక్తి - బిజినెస్ బ్యూరో



తెలంగాణ రాష్ట్ర పోలీస్ డిపార్ట్‌మెంట్‌తో ప్రభుత్వ రంగంలోని బ్యాంక్ ఆఫ్ బరోడా (బిఒబి) కీలక ఒప్పందం కుదుర్చుకుంది. తెలంగాణ పోలీస్ శాఖ సిబ్బందికి "బరోడా పోలీస్ సాలరీ ప్యాకేజీని" అందించడానికి గురువారం అవగాహన ఒప్పందం ఏర్పాటు చేసుకుంది. ఈ ఒప్పందంలో భాగంగా తెలంగాణ పోలీస్ శాఖ సిబ్బందికి ఉచిత సమగ్ర వ్యక్తిగత ప్రమాద బీమా కవర్ (పిఎఐ), యోధా రిటైల్ లోన్లపై ప్రత్యేక ఆఫర్లు, డెబిట్, క్రెడిట్ కార్డ్ సేవలతో పాటు అనేక ప్రత్యేక ప్రయోజనాలను బ్యాంకు అందచేయనుంది. వాటిలో ముఖ్యంగా, ఖాతాదారు విధి నిర్వహణ సమయంలో ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.1.05 కోట్ల వరకు, విధినిర్వహణేతర సమయంలో మరణిస్తే రూ.90 లక్షల వరకు, శాశ్వత వైకల్యంపై రూ.60 లక్షల వరకు, పాక్షిక వైకల్యంపై రూ.30 లక్షల వరకు వ్యక్తిగత ప్రమాద బీమాను అందించనుంది. డిజిపి అంజనీకుమార్ ఆధ్వర్యంలో పోలీసుల శాఖ తరపున ఎడిజిపి భిలాష బిష్త్, బిఒబి తరుపున రితేష్ కుమార్ ఒప్పందాలను మార్చుకున్నారు.

దోపిడీకి గురవుతున్న మధ్యాహ్న భోజన కార్మికులు

- అఖిల భారత మధ్యాహ్న భోజన పథకం కార్మిక సంఘం అధ్యక్షులు డా. విజయలక్ష్మి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



ధర్నాలో మాట్లాడుతున్న డా. విజయలక్ష్మి

ప్రభుత్వం ప్రకటించిన కనీస వేతనం కంటే మధ్యాహ్న భోజన కార్మికులకు ఇచ్చే వేతనం చాలా తక్కువ అని అఖిల భారత మధ్యాహ్న భోజన పథకం కార్మిక సంఘం అధ్యక్షులు డా. బివి విజయలక్ష్మి అన్నారు. సకాలంలో వంట బిల్లులు, వేతనాలు చెల్లించక ప్రభుత్వం నిరంతరం వారిని దోపిడీకి గురిచేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యలు తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ ధర్నాచౌక్ వద్ద తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మిక సంఘం (ఎఐటియుసి) ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షులు పి ప్రేమ్ పావని అధ్యక్షత గురువారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో సుమారు 54,201 మందికిపైగా మధ్యాహ్న భోజన వంట కార్మికులు, 28 లక్షల మందికిపైగా విద్యార్థులకు ఆహారాన్ని అందిస్తున్నారన్నారు. ఎన్నో వ్యయప్రయాసలకోర్చి విద్యార్థులకు సకాలంలో ఆహారాన్ని వండి పెడుతున్న కార్మికుల శ్రమకు తగ్గ ఫలితం మాత్రం దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పులు చేసి కూరగాయలు, కిరాణం సామాన్లు, కోడి గుడ్లు కొనుగోలు చేసి వంటలు చేస్తే, దానికి బిల్లులతోపాటు వేతనాలు కూడా ఐదారు నెలల వరకు ఇవ్వకపోతే ఎలా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. తెచ్చిన అప్పులు తీరక, కొత్త అప్పులు దొరక్క కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. వంటలు చేస్తున్న సమయాల్లో గ్యాస్ లేకపోతే కట్టెల పొయ్యిల పొగతో కార్మికుల కంటి చూపు దెబ్బతింటోందని, కొన్ని సందర్భాల్లో వేడి గంజి మీదపడి కాళ్లు, చేతులు కాలిన ఘటనలు ఉన్నాయని చెప్పారు. అయినా ప్రభుత్వం వీరి సమస్యలపై స్పందించకపోవడం దారుణమన్నారు. ముఖ్యమంత్రి కెసిఆర్ తక్షణమే స్పందించి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ బాలరాజ్ మాట్లాడుతూ.. సంవత్సరన్నర కిందట మధ్యాహ్న భోజన పథకం కార్మికుల రూ. వెయ్యి గౌరవ వేతనాన్ని రూ.3000కు పెంచుతున్నట్టు ప్రకటించారని, ఇప్పటివరకు కార్మికుల ఖాతాలో జమకాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయమైన డిమాండ్ల సాధనకు సమ్మెను ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ మాట్లాడుతూ.. వేతనాలతోపాటు బిల్లులు తొమ్మిది నెలలుగా పెండింగ్ ఉన్నాయని, పదే పదే అధికారులకు విజ్ఞప్తి చేసినా ప్రయోజనం దక్కడం లేదని అన్నారు. ఈ ధర్నాలో ఎఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ, కార్యదర్శి నండూరి కరుణకుమారి, తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మిక సంఘం గౌరవ అధ్యక్షులు డి కమల రెడ్డి, కార్యనిర్వాహక అధ్యక్షులు పూసల రమేష్, ఉపాధ్యక్షులు కోరిమి సుగుణ, కుంటల రాములు, దండు లక్ష్మణ్, చెన్నం దశరథం, కార్యదర్శులు బి రాజేశ్వరి, బి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ధరలను తగ్గించకుంటే..

కేంద్ర ప్రభుత్వం ఇంటికే : ఐద్వా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



నిరసన తెలుపుతున్న ఐద్వా నాయకులు, స్థానిక మహిళలు

కేంద్రప్రభుత్వం పెంచిన నిత్యవసర వస్తువుల ధరలు తగ్గించకుంటే మహిళలంతా బిజెపి ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపుతారని ఐద్వా వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి నలిగంటి రత్నమాల పిలుపునిచ్చారు. వరంగల్ జిల్లా ఐద్వా కమిటీ ఆధ్వర్యంలో గురువారం వరంగల్ హెడ్ పోస్ట్ ఆఫీస్ సెంటర్‌లో కూరగాయల దండలతో నిరసన తెలుపుతూ రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పేద, మధ్య తరగతి ప్రజలకు నిత్యవసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటాయని తెలిపారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చేటప్పుడు ధరల నియంత్రణ చట్టాన్ని అమలు చేస్తామని హామీనిచ్చి నేడు ఆ చట్టాన్ని కాలరాస్తోందన్నారు. దేశ వనరులు, సంపద, ఆర్థిక స్వావలంబనాన్ని, నిత్యవసర వస్తువులను సహితం అంబానీ, అదానీలకు ప్రధాని మోడీ కట్టబెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మోడీ అధికారంలోకి వచ్చేటప్పుడు వంట గ్యాస్ ధర రూ.450 ఉంటే నేడు రూ.1250 ఉందన్నారు. నిత్యం వాడుకునే టమాటా, మంచి నూనెలు, అల్లం, ఎల్లిగడ్డ.. తదితర కూరగాయల ధరలు పెరగడంతో ప్రజలు మూడు పూటలా తినే ఆహారాన్ని రెండు పూటలకే కుదించుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. రేషన్ షాపుల్లో నాలుగున్నర కేజీల బియ్యం ఇచ్చి చేతులు దులుపుకుంటూ పేదలు తింటున్న తిండిపై ధరలు పెంచి మధ్య దళారీలకు దోచిపెట్టడం సరి కాదన్నారు. రేషన్ షాపుల ద్వారా కేరళ రాష్ట్ర ప్రభుత్వం 14 రకాల నిత్యవసర సరుకులు ఇస్తుందని, అలాగే కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాల్లో రేషన్ షాపుల ద్వారా నిత్యవసర సరుకులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మహిళల ఆరోగ్యంపై అంతర్జాతీయ ఆహార సంస్థ ఆరోగ్య సంస్థలు వెంటనే సర్వేలు చేయాలని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ధరలు తగ్గించకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ రాస్తారోకోలో జిల్లా కమిటీ సభ్యులు ఎన్ రేణుక, టి భవాని, ఎం సునీత, సుభద్ర, రాజేశ్వరి, ప్రీతి, శారద, రాజక్క, రాజ కళ తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమికం.. అత్యంత ఆవశ్యకం...

- పిహెచ్‌సిల బలోపేతంతోనే ప్రజారోగ్యం పరిపూర్ణం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం జరగకుండా ఆ సమాజం ప్రగతిని సాధించలేరనేది సత్యం. కరోనా మహమ్మారితో ప్రపంచవ్యాప్తంగా ఆర్థికంగా బలంగా ఉన్న దేశాలకు సైతం మహమ్మారి దెబ్బకు వణికిపోవడం, ప్రజారోగ్య వ్యవస్థ బలంగా ఉన్న దేశాలు ధీటుగా ఎదుర్కొనడం కండ్ల ముందు సాక్షాత్కరించిన దృశ్యం. ఈ నేపథ్యంలో ఆయా ప్రభుత్వాలు ప్రజారోగ్య వ్యవస్థను బలోపేతం చేయాల్సిన అవసరాన్ని గుర్తించాయి. అదే క్రమంలో రాష్ట్రం ప్రభుత్వ వైద్యవ్యవస్థను బలోపేతం చేసేందుకు పూనుకున్నది. ప్రభుత్వం తీసుకుంటున్న అనేక చర్యలు, కార్యక్రమాలు పలువురి ప్రశంసలు అందుకుంటున్నాయి. అదే సమయంలో ప్రాధాన్యతలను గుర్తించాల్సిన విషయంపై పలు సూచనలు వస్తున్నాయి. వాటిని పరిగణలోకి తీసుకుంటే ప్రజలకు మరింత మేలు జరిగే అవకాశముంది.

రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకో మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో ముందుకెళుతున్నది. ఇప్పటికే ప్రభుత్వ, ప్రయివేటు మెడికల్ కాలేజీల నుంచి రాబోయే మూడు, నాలుగేండ్లలో ప్రతి ఏడాది ఎనిమిది వేల మందికిపైగా ఎంబీబీఎస్ పూర్తి చేసుకుని బయటికొచ్చే వారి సేవలను ప్రజలకు ఉపయోగించుకునేలా నియామకాలు చేపట్టాల్సి ఉంటుంది. లేకపోతే ప్రయివేటు లేదా విదేశాలకు ఉపాధి కోసం వెళ్లే పరిస్థితి ఏర్పడే ప్రమాదం ఉంది.

ప్రభుత్వం తీసుకున్న చర్యలతో ఇప్పటికే రాష్ట్రంలో మాతా, శిశు మరణాల సంఖ్యను గణనీయంగా తగ్గించగలిగింది. వ్యాక్సినేషన్, ఇమ్యూనైజేషన్ కార్యక్రమాల్లోనూ ముందు వరసలో నిలిచింది. అదే సమయంలో ప్రాథమిక వైద్యాన్ని బలోపేతం చేసేందుకు పెద్ద ఎత్తున బస్తీ దవాఖానాలు, పల్లె దవాఖానాల వ్యవస్థను తీసుకొచ్చి వైద్యరంగాన్ని మూడంచెల నుంచి ఐదెంచల వ్యవస్థగా మార్చి క్రమబద్ధీకరించే ప్రయత్నం చేసింది. వీటి ద్వారా ప్రజలకు చిన్న, చిన్న రోగాలు వచ్చిన సందర్భాల్లో మందులిచ్చేందుకు ఉపయోగిస్తున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ నివారణ, చికిత్స, పునరావాసం, అవసానదశలో ఉపశమనం (పాలియేటివ్ కేర్) లాంటివి ప్రాథమిక ఆరోగ్య దశలోనే అందేలా చూడాలని సూచించింది. ఆ మేరకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను తీర్చిదిద్దితే బాగుంటుందని డాక్టర్లు సూచిస్తున్నారు. ఆరోగ్య అవగాహన, దాని పట్ల ప్రేరణ కలిగిస్తూ, ప్రవర్తనలు, అలవాట్ల వల్ల వచ్చే రోగాల నుంచి బయటపడేందుకు ప్రాథమిక స్థాయిలోనే నిర్మాణం ఉండాల్సిన అవసరముంది. అక్కడి ప్రాథమిక వైద్యమందించే డాక్టర్లకు ఈ మేరకు తగిన శిక్షణ ఇస్తే బాగుంటుంది. ఈ దిశగా కుటుంబంలోని అన్ని వయస్సుల వారి ఆరోగ్యాన్ని చూడగలిగిన ఫ్యామిలీ మెడిసిన్ చదివిన వైద్యుల సేవలను ఉపయోగించుకోవచ్చు. ఇప్పటికే ఫ్యామిలీ మెడిసిన్ (కుటుంబ వైద్యం) చదివిన వారి సేవలను ఉపయోగించుకున్న రాష్ట్రాలు, దేశాల్లో ప్రాథమిక ఆరోగ్య వ్యవస్థ బలోపేతంగా ఉన్న అనుభవాలున్నాయి. పాఠశాల స్థాయిలోనే ఆరోగ్య అవగాహన కల్పించే కార్యక్రమాలను నిర్వహించడం ద్వారానూ మెరుగైన ఫలితాలుంటాయని నిపుణులు సూచిస్తున్నారు.

ప్రాథమిక ఆరోగ్యానికి ఎక్కువ నిధులు కేటాయించాలి : డాక్టర్ శ్రీనివాస్

ఆరోగ్యరంగ బడ్జెట్‌లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు ఎక్కువ నిధులు కేటాయించాలని అకాడమీ ఆఫ్ ఫ్యామిలీ ఫిజీషియన్స్ ఆఫ్ ఇండియా తెలంగాణ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ శ్రీనివాస్ సూచించారు. ఆస్పత్రుల్లో ప్రసవాలు పెరగడం శుభపరిణాం. మాతా, శిశువుల ఆరోగ్యం, మరణాలను తగ్గించారు. వ్యాక్సినేషన్ ప్రక్రియ లాంటి వాటిలో మంచి ప్రగతి కనిపిస్తోంది. నాన్ కమ్యూనికేబుల్ డిసీజెస్ (ఎన్‌సిడి) క్లినిక్‌లు నామమాత్రంగా మారాయి. వాటిలో ఉన్న వైద్యులకు బిహేవియర్ ఛేంజ్ కౌన్సిలింగ్ పద్ధతిపై శిక్షణ ఇవ్వాల్సిన అవసరముంది. ఎన్ఎంసి గుర్తించిన ఫ్యామిలీ మెడిసిన్ రెండు సంవత్సరాల కోర్సును జిల్లా ఆస్పత్రులు, 50 బెడ్లు, 100 బెడ్లు ఉన్న ఆస్పత్రుల్లో ప్రారంభించాలి. ఫ్యామిలీ మెడిసిన్ చేసిన డాక్టర్ల సేవలు ప్రాథమిక ఆరోగ్య సేవల్లో గణనీయంగా ఉపయోగపడతాయి.

రానున్న మూడు రోజులు మోస్తరు వర్షాలు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో వచ్చే మూడు రోజులపాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రధాన అధికారి కె.నాగరత్న తెలిపారు. శుక్రవారంనాడు కొమ్రంభీమ్ అసిఫాబాద్, మంచిర్యాల జయశంకర్ భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు పడే సూచనలు ఉన్నాయి. గురువారం రాత్రి 10 గంటల వరకు రాష్ట్రంలో 145 ప్రాంతాల్లో వర్షపాతం నమోదైంది. అందులో 39 ప్రాంతాల్లో మోస్తరు వాన పడింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలో అత్యధికంగా 4.5 సెంటీమీటర్ల వర్షం కురిసింది.

ఉపాధ్యాయులు ఉద్యమాలకు సిద్ధంగా ఉండాలి

- పిఆర్‌టియు తెలంగాణ పిలుపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలకు సిద్ధంగా ఉండాలని ఉపాధ్యాయులకు పిఆర్‌టియు తెలంగాణ పిలుపునిచ్చింది. గురువారం హైదరాబాద్‌లో ఆ సంఘం అత్యవసర సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం పిఆర్‌టియు తెలంగాణ అధ్యక్షులు ఎం చెన్నయ్య, ప్రధాన కార్యదర్శి సుంకరి బిక్షంగౌడ్ ఒక ప్రకటన విడుదల చేశారు. బదిలీలు న్యాయస్థానం పరిధిలో ఉన్నందున, తొమ్మిదేండ్లుగా వేచిచూస్తున్న ఉపాధ్యాయుల పదోన్నతులు వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. డిఎస్‌సి-2003 ఉపాధ్యాయుల నియామకం, సిపిఎస్ అమలు కన్నా ముందే జరిగినందున కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం రాష్ట్రంలో ఉన్న ఆరు వేల మంది ఉపాధ్యాయులకు వెంటనే పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలని కోరారు. సిపిఎస్‌ను పూర్తి చేయాలని తెలిపారు. ఏళ్ల తరబడి ఈ-కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే చెల్లించాలని పేర్కొన్నారు. నూతన పీఆర్సీ కమిటీని ఏర్పాటు చేయాలని, తక్షణమే మధ్యంతర భృతి ప్రకటించాలని కోరారు. ఉపాధ్యాయుల ఇహెచ్‌ఎస్‌ను వెంటనే అమలు చేయాలని తెలిపారు. 13 జిల్లాల స్పౌజ్ ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టాలని పేర్కొన్నారు. సమస్యల సాధన కోసం ఆందోళనా కార్యక్రమాలకు ఉపాధ్యాయులు సిద్ధంగా ఉండాలని కోరారు.

30 శాతం ఐఆర్ ప్రకటించాలి : టిఎస్‌పిటిఎ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వేతన సవరణ సంఘం గడువు గతనెలతో ముగిసినా రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్టు వ్యవహరించడాన్ని టిఎస్‌పిటిఎ అధ్యక్షులు సయ్యద్ షౌకత్‌అలీ తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వం ఉదాసీనతను విడనాడి 30 శాతం మధ్యంతర భృతి (ఐఆర్) ప్రకటించాలని గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈనెల నుంచి అమయ్యేలా మంజూరు చేయాలని కోరారు. మూడు నెలల కాలవ్యవధితో నివేదిక సమర్పించేలా 12వ పిఆర్‌సి కమిటీని ఏర్పాటు చేయాలని సూచించారు. ఉపాధ్యాయుల బదిలీలు ఆలస్యం అవుతున్నందున వివాదం లేని పదోన్నతుల ప్రక్రియను వెంటనే చేపట్టాలని కోరారు. డిఎస్‌సి -2003 ఉపాధ్యాయులకు పాత పెన్షన్ పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

పాత పెన్షన్ సాధన సంకల్పయాత్రకు టిఎస్‌టియు మద్దతు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సిపిఎస్)ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరుతూ ఈనెల 16 నుంచి టిఎస్‌సిపిఎస్‌ఇయు ఆధ్వర్యంలో చేపట్టబోయే పాత పెన్షన్ సాధన సంకల్పయాత్రకు టిఎస్‌టియు సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎండి అబ్దుల్లా, ప్రధాన కార్యదర్శి చందూరి రాజిరెడ్డి గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాజస్థాన్, చత్తీస్‌ఘడ్, జార్ఖండ్, హిమాచల్‌ప్రదేశ్, పంజాబ్, కర్నాటక మాదిరిగా తెలంగాణలోనూ సిపిఎస్‌ను రద్దు చేసి ఒపిఎస్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. 2004 తర్వాత నియమించిన ఉద్యోగ, ఉపాధ్యాయుల కుటుంబాలకు భరోసా కల్పించాలని కోరారు.

తవ్వినకొద్దీ అక్రమాలు

- వెలుగుజూస్తున్న మిల్లుల బాగోతం
- స్వయంగా రంగంలోకి దిగిన సివిల్ సప్లయ్ కార్పొరేషన్ చైర్మన్ రవీందర్‌సింగ్
- రాష్ట్ర ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్ అధికారులతో కలిసి సోదాలు
- ప్రభుత్వమిచ్చే ధాన్యం, సిఎంఆర్ అమ్ముకుంటున్న మిల్లుల సీజ్
- తెల్లసంచుల్లో ధాన్యం, పిడిఎస్ బియ్యం నిల్వలు



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కరీంనగర్ జిల్లాలో తవ్వినకొద్దీ మిల్లర్ల అక్రమాలు వెలుగుజూస్తున్నాయి. ప్రభుత్వం ఇచ్చే ధాన్యం అమ్ముకుంటూ, ఎఫ్‌సిఐకి ఇవ్వాల్సిన సిఎంఆర్‌ను పక్కదారిపట్టిస్తూ అక్రమంగా సొమ్ము చేసుకుంటున్న వారి బాగోతాలు ఒక్కొక్కటిగా బయటకొస్తున్నాయి. స్వయంగా సివిల్ సప్లయ్ కార్పొరేషన్ చైర్మెన్ సర్దార్ రవీందర్‌సింగ్ రంగంలోకి దిగారు. రాష్ట్ర ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్ అధికారులతో కలిసి నాలుగు రోజులుగా సోదాలు నిర్వహిస్తున్నారు. ఎలాంటి బ్యాంక్ గ్యారెంటీ లేకుండా ప్రభుత్వమే రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసి మిల్లింగ్ కోసం ఇస్తుండగా.. 'సొమ్ము ఒకరిది.. సోకొకరిది' అన్న చందంగా పలువురు మిల్లర్లు అక్రమాలకు తెరతీశారు.

రాష్ట్రంలో మిల్లింగ్ సామర్థ్యానికి మించి వచ్చే లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యం కొందరు మిల్లర్ల అక్రమ వ్యాపారానికి అవకాశంగా మారింది. ప్రతి సీజన్‌లోనూ గడువులోపు ఎఫ్‌సీఐకి కస్టమ్ మిల్లింగ్ రైస్ (సిఎంఆర్) ఇవ్వకుండా ప్రభుత్వ ధాన్యంతోనే వ్యాపారాన్ని సాగిస్తున్నారు. సర్కారు బియ్యాన్నే బహిరంగ మార్కెట్‌లో అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు.

అందులోనూ బియ్యాన్ని నూకలుగా మార్చి మరీ అధికారులను ఏమార్చుతూ దర్జాగా లారీల్లో తరలిస్తున్నారు. గడువులోపు సిఎంఆర్ ఇవ్వకుండా జాప్యం చేసే మిల్లులకు అధికారులు నోటీసులు ఇస్తూ కొన్నింటిని బ్లాక్‌లిస్టులో పెడుతున్నారు. అయినప్పటికీ ఏటా రెండు సీజన్లలో భారీగా వచ్చే ధాన్యం దిగుబడులకు.. మిల్లింగ్ చేసే సామర్థ్యం సరిపోవడం లేదు. దాంతో మళ్లీ అవే మిల్లులకు మినహాయింపులు ఇస్తూ ధాన్యం కేటాయిస్తున్నారు. మిల్లుల్లో లెక్కకు రాని బియ్యంపై తేల్చాల్సిన అధికారులకు ప్రతి ఆర్నెల్లకోమారు వచ్చే ధాన్యం దిగుబడులు, అవి మిల్లులకు కేటాయించడం, తిరిగి సిఎంఆర్ సేకరించడం వంటి పనుల మధ్య ఒత్తిడికి గురవుతున్నారు. తప్పని పరిస్థితుల్లో కొన్ని మిల్లులపై చర్యలు తీసుకున్నా.. మళ్లీ మినహాయింపులు ఇవ్వాల్సి వస్తూ తిరిగి ధాన్యం కేటాయింపులు చేస్తున్నారు. 2022-23 వానాకాలం సీజన్‌కు సంబంధించిన సిఎంఆర్ 25శాతం కూడా ఎఫ్‌సిఐకి ఇవ్వకపోవడమే ఇందుకు నిదర్శనం.

రంగంలోకి సివిల్ సప్లయ్ కార్పొరేషన్ చైర్మెన్

కార్పొరేషన్ ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్, సివిల్ సప్లయ్ అధికారులతో రవీందర్‌సింగ్ కలిసి బృందాలుగా ఏర్పడి.. ఈ నెల 11 నుంచి హుజూరాబాద్ కేంద్రంగా మిల్లుల్లో తనిఖీలు చేపడుతున్నారు. ఈ తనిఖీల్లో సిఎంఆర్ కోసం ప్రభుత్వం ఇచ్చిన ధాన్యం, నిల్వ ఉన్న బియ్యంతోపాటు రికార్డులనూ పరిశీలిస్తున్నారు. ఈ క్రమంలో మహాలక్ష్మి ఇండస్ట్రీస్‌లో సిఎంఆర్‌కు సంబంధించిన 4173 క్వింటాళ్ల ధాన్యం నింపిన 10,437 బ్యాగులు మాయమైనట్టు గుర్తించారు. దీనిపై సదరు మిల్లు యజమానిని ప్రశ్నిస్తే సరైన సమాధానం రాలేదు. లక్ష్మీ గణపతి రైస్‌మిల్లులోనూ 3,817 బస్తాలు ధాన్యం తక్కువగా ఉన్న విషయాన్ని గుర్తించారు. మహాలక్ష్మి ఇండస్ట్రీస్ యజమానే వరుణ్ రైస్‌మిల్లునూ నిర్వహిస్తుండగా.. ఆ మిల్లులోనూ ఆరా తీసి సీజ్ చేశారు. లక్ష్మీ గణపతి, హనుమాన్ రైస్ మిల్లుల్లో పిడిఎస్ బియ్యం ఉన్న విషయాన్ని గుర్తించిన అధికారులు, శాంపిల్స్ సేకరించి స్థానిక అధికారులకు అప్పగించారు. ఇలా మరిన్ని మిల్లుల్లో కూడా గన్నీ బ్యాగులకు బదులుగా తెల్ల సంచుల్లో నింపిన ధాన్యాన్ని, పిడిఎస్ బియ్యాన్ని, లెక్కల్లో లెక్కకురాని రికార్డులను గుర్తించారు.

ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదు

సర్దార్ రవీందర్‌సింగ్, సివిల్ సప్లయ్ కార్పొరేషన్ చైర్మెన్

రాష్ట్రంలో పెద్దఎత్తున ధాన్యం దిగుబడులు వస్తున్నందున ప్రభుత్వమే ఎలాంటి బ్యాంకు గ్యారెంటీ లేకుండా నేరుగా మిల్లులకు అందిస్తోంది. మిల్లులకు అండగా నిలుస్తోంది.

సర్కారును మోసం చేస్తూ నష్టం కలిగించే విధంగా సిఎంఆర్ ఇవ్వకుండా కొందరు బియ్యంతో పాటు ధాన్యాన్నీ అమ్ముకుంటున్నట్టు మా దృష్టికి వచ్చింది. మా తనిఖీల్లోనూ తేలింది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని మిల్లుల్లోనూ సోదాలు నిర్వహిస్తాం. ప్రభుత్వానికి నష్టం కలిగించేవారిలో ఎంతటి వారు ఉన్నా ఉపేక్షించేది లేదు.

గ్రూప్-2పై ఉచిత అవగాహన సదస్సు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో నిర్వహించబోయే గ్రూప్-2 పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థుల కోసం అమిగోస్ 21వ సెంచరీ ఐఎఎస్ అకాడమి ఆధ్వర్యంలో ఈ నెల 16 నుంచి ఉచిత అవగాహన సదస్సును నిర్వహించనున్నట్టు ప్రకటించింది. ఈ మేరకు ఆ అకాడమి అకడమిక్ డైరెక్టర్ జనార్ధన్‌రెడ్డి గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎపిపిఎస్‌సి కొత్త సిలబస్‌పై వర్క్‌షాప్, ప్రిలిమ్స్ ఉచిత మాక్ టెస్ట్ ఈనెల 16న ఉదయం తొమ్మిది గంటలకు హైదరాబాద్‌లోని అశోక్‌నగర్‌లో తమ అకాడమిలో నిర్వహిస్తామని తెలిపారు. ఇందులో గ్రూప్-2 కొత్త సిలబస్, సన్నద్ధత ప్రణాళిక, నోట్సు మేకింగ్, సమయపాలన వంటి అంశాలపై సీనియర్ అధ్యాపకులు అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు. మాక్ టెస్టు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో నిర్వహిస్తామని వివరించారు.

కెసిఆర్ అసమర్థ పాలనకు హిమాన్షు మాటలే నిదర్శనం : ఎఐఎస్‌ఎఫ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్టంలో ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న సమస్యలపై సిఎం కెసిఆర్‌కు, విద్యాశాఖ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డికి పట్టింపు లేదని ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కసిరెడ్డి మణికంఠరెడ్డి, కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ విమర్శించారు. గౌలిదొడ్డిలోని కేశవ నగర్‌లో ఉన్న ప్రభుత్వ పాఠశాలలను చూస్తే కన్నీళ్లు వచ్చాయనీ, అందుకే దత్తత తీసుకుని అభివృద్ధి చేశానంటూ కెసిఆర్ మనువడు, కెటిఆర్ తనయుడు హిమాన్షు మాట్లాడిన మాటలు అసమర్థ పాలనకు నిదర్శనమని గురువారం ఒక ప్రకటనలో విమర్శించారు. ఆ పాఠశాలలో ఉన్న సమస్యలను చూసి హిమాన్షు బాధపడ్డారనీ, కానీ సిఎం కెసిఆర్‌కు మాత్రం సోయిలేదని తెలిపారు. రాష్టంలోని 26 వేల ప్రభుత్వ పాఠశాలలు సమస్యలకు నిలయంగా ఉన్నాయనీ, ఒక్క పాఠశాలలలో కూడా సరైన మౌలిక వసతులు లేవనీ, సరిపడా ఉపాధ్యాయుల్లేరనీ, బోధనేతర సిబ్బంది లేరనీ, మధ్యాహ్న భోజనానికి గదుల్లేవనీ, తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం లేని పాఠశాలలు ఎన్నో ఉన్నాయని విమర్శించారు. ఇప్పటికీ పాఠ్య పుస్తకాలురాని పాఠశాలలు కూడా ఉన్నాయని తెలిపారు. కానీ ప్రభుత్వం, ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి, ఎమ్మెల్యేలు ఒక్క రోజు కూడా ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న సమస్యలు అడిగి తెలుసుకున్న పరిస్థితి లేదని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనపై శ్రద్ధ ఉంటే వెంటనే సమీక్ష చేసి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేదంటే సచివాలయాన్ని ముట్టడిస్తామని ప్రభుత్వాన్ని వారు హెచ్చరించారు.

హక్కులను కాలరాస్తున్న మోడీ ప్రభుత్వం

- ఆధునిక సమాజంలో అనాగరిక పాలన
- అరుణ మూడో వర్ధంతి కార్యక్రమంలో హైమావతి



సెమినార్‌లో మాట్లాడుతున్న హైమావతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్రంలో ప్రధాని మోడీ ప్రభుత్వం హక్కులను కాలరాస్తోందని, ఆధునిక సమాజంలోనూ అనాగరిక పాలన కొనసాగుతోందని ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షులు హైమావతి అన్నారు. వంద ఏండ్ల కిందట ఉద్యమాల ద్వారా సాధించుకున్న హక్కులను కాలరాసేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వనపర్తి జిల్లా మిడ్జిల్ మండలం వాడియాల గేటు దగ్గర టిఆర్‌ఆర్ ఫంక్షన్ హాల్‌లో గురువారం ఐద్వా జిల్లా మాజీ కార్యదర్శి అరుణ 3వ వర్ధంతి సభ, 'పెరుగుతున్న నిత్యావసర ధరలు- ప్రజలపై ప్రభావం' అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా హైమావతి మాట్లాడుతూ.. కొంతకాలం కలిసి జీవించిన వారిని, ఉద్యమాల ద్వారా ప్రజలకు దగ్గరైన వారిని మరిచిపోవడం అంత సులభం కాదన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పరితపించే అరుణ మరణం కుటుంబానికే కాక సిపిఎంకు, ఐద్వాకు తీరనిలోటన్నారు. నిత్యావసర సరుకులు నింగిని అంటుతున్న సమయంలో మహిళలను సమీకరించి ఉద్యమాలు చేసే అరుణలాంటి వ్యక్తులు సమాజానికి దూరం కావడం బాధాకరమన్నారు. మహిళల హక్కులను హరించి సమాజాన్ని వెనక్కి నెట్టేస్తున్న బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దించాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలో మహిళలు అత్యంత ప్రమాదంలో ఉన్నారని, వీరి రక్షణకు, ప్రజాస్వామ్యాన్ని కాపాడటానికి మహిళా హక్కుల కోసం పరితపించిన అరుణ బాటలో ఐక్య ఉద్యమాలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. మనుషులను మనుషులుగా చూడకుండా ప్రజల మధ్య విభజనలు సృష్టిస్తూ.. మనుధర్మ శాస్త్రం ఆధారంగా పరిపాలన చేస్తామనడం మూర్ఖత్వమన్నారు. బిజెపి అధికారంలోకొచ్చాక గ్యాస్ బండ ధర రూ.1200కు పెంచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు పెంచడమే గుజరాత్ మోడలా అని ప్రశ్నించారు. భారతదేశంలో అదానీ, అంబానీ రిలయన్స్ కంపెనీలు నిత్యావసర వస్తువులను బ్లాక్ మార్కెట్లోకి తరలించడం వల్లే ధరలు పెరుగుతున్నాయని చెప్పారు. కార్పొరేట్ వ్యాపారులు నిత్యావసర సరుకులను దాచిపెట్టడం వల్లే స్థానిక చిరు వ్యాపారులతోపాటు వినియోగదారులు నష్టపోతున్నారని చెప్పారు.

తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి సాగర్ మాట్లాడుతూ.. అనేక ప్రజా ఉద్యమాలను నడిపిన అరుణ జీవితం సంపూర్ణమైనదన్నారు. మధ్య దళారుల ప్రమేయం లేకపోతే టమాట ధర కిలో 120 రూపాయలకు చేరేది కాదన్నారు. ఇటు రైతులకు అటు వినియోగదారులకు మధ్యలో ఉండే దళారులే రైతు మార్కెట్‌ను శాసిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణ సమీప ప్రాంతాల్లో వినియోగానికి సరిపడే కూరగాయలు సాగు చేస్తే ఈ స్థాయిలో ధరలు పెరిగేవి కావన్నారు. సాగుబడి తగ్గడం వల్ల దిగుబడి చేస్తున్న కూరగాయలు, ఆహార వస్తువులపై దళారుల ప్రమేయం పెరిగిందన్నారు. వీటన్నింటి నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు కేంద్రంలో బిజెపి ప్రభుత్వం తాజాగా ఉమ్మడి పౌరస్మృతి పేరుతో ప్రకటనలు చేస్తోందని విమర్శించారు.

ముందుగా అరుణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర నాయకులు కిల్లే గోపాల్, సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ రాములు, కెవిపిఎస్ రాష్ట్ర నాయకులు కురుమయ్య, వెంకటేష్, ఐద్వా జిల్లా కార్యదర్శి పద్మ, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలతో 'రైతన్నకు నష్టం'

- కంపెనీలు.. ఆర్గనైజర్లదే ఆధిపత్యం ..?
- ఎర్రతెగులు సోకిన 40 వేల ఎకరాల్లో పైరు ధ్వంసం
- సీడ్ రైతులకు భరోసా కల్పించాలని రైతు సంఘం నాయకుల డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'నకిలీ విత్తనాలతో నిండా ముంచారు. దీనికి కంపెనీలు, ఆర్గనైజర్లు, సబ్ ఆర్గనైజర్లు బాధ్యత వహించాలి. ఫౌండేషన్ సీడ్ వేసిన పంట పొలాల్లో ఐదు మొక్కలకు ఒక మొక్కనే బాగుంది. మిగతా నాలుగు మొక్కలు గిటుకబారి పోయాయి. ఎర్ర తెగులుతో పూత, కాయ ఏదీ రావడం లేదు. ఎకరాకు రెండున్నర లక్షల వరకు పెట్టుబడి అయింది. ఎర్ర తెగులు వల్ల పంట రాదు.. మొలకలను మొత్తం తొలగిస్తున్నాం' అని సీడ్ పత్తి రైతులు లబోదిబోమంటున్నారు.

జోగులాంబ గద్వాల జిల్లా పరిధిలో 50 వేల ఎకరాల్లో సీడ్ పత్తిని సాగు చేస్తున్నారు. కావేరి, రాశి, వేద, నూజివీడు, జెకె, పాలమూరు, ధనలక్ష్మి, రాయల, శ్రీరామ, గంగా, తులసి వంటి విత్తనాలను కంపెనీల ఆర్గనైజర్లు, సబ్‌ఆర్గనైజర్ల ద్వారా రైతులకు అందజేస్తాయి. ప్రతి ఏడాదీ మే నెలలో సబ్ ఆర్గనైజర్లు వచ్చి రైతులకు మొదట ఫౌండేషన్ విత్తనాలు ఇస్తారు. దాంతోపాటు రూ.లక్ష వరకు పంట రుణం అందజేస్తారు. ఆహార పంటలకు సరైన గిట్టుబాటు ధరలు లేకపోవడం వల్ల 30 ఏళ్ల నుంచి వాణిజ్యపంట అయిన సీడ్ పంటలను ఈ ప్రాంతంలో రైతులు సాగు చేస్తున్నారు. అయితే, రైతులు, కంపెనీల మధ్య ఒప్పందం చేసుకోకపోవడం వల్ల పంట నష్టం జరిగితే కంపెనీలను అడిగే వీలు లేకుండా పోయింది. ఎకరాకు రూ. మూడు లక్షలకు పైగా పెట్టుబడి పెట్టే ఈ సీడ్ పంటలకు బీమా లేకపోవడం వల్ల రైతులు ఎక్కువగా నష్టపోతున్నారు. పెట్టుబడి కింద ఇచ్చే అప్పుకు కంపెనీలు రెండు రూపాయలు మిత్తి వసూలు చేస్తున్నాయి. మేలో అప్పు ఇస్తే.. తిరిగి జూన్‌లో వడ్డీతో చెల్లించాల్సి ఉంది. ఈ



పంటను తొలగిస్తున్న రైతులు

ఏడాది నష్టపోతే వచ్చే ఏడాది అప్పులు తీర్చాల్సి ఉంది. కంపెనీలు మాత్రం ఎటువంటి బాధ్యతా వహించడం లేదు. మంతకల్ మండలం బిజ్వారం గ్రామంలో రైతు శివన్న సీడ్ పత్తిని సాగు చేస్తున్నాడు. నకిలీ విత్తనాలు ఇవ్వడంతో పైరు పంట పూర్తిగా దెబ్బతిన్నది. పంట చేతికి వచ్చే అవకాశం లేకపోవడంతో మొక్కలను తొలగించి మరో పంట సాగు చేయడానికి సిద్ధమవుతున్నాడు. సీడ్ పత్తి సాగుకు రూ.పది లక్షలకుపైగా పెట్టుబడి అయింది. అదే గ్రామానికి చెందిన ఆంజనేయులు రెండెకరాల్లో సీడ్ పత్తిని సాగు చేశాడు. మంతకల్ మండలం హిందూవాసి గ్రామానికి చెందిన రైతు మల్దకల్ ఎకరం సాగు చేశాడు. గట్టు మండలం బోయలగూడెంలో పుల్లయ్య రెండెకరాలు, రాజు, యువరాజు రెండెకరాల చొప్పున సాగు చేశారు. నకిలీ విత్తనాలు కావడంతో పైరును మేకలు, గొర్రెలకు వదిలేశారు. కొంతమంది రైతులు పైరును ధ్వంసం చేసి ఇతర పంటలు సాగు చేయడానికి సమాయత్తం అవుతున్నారు. గద్వాల జిల్లా ఉండవల్లి అలంపూర్, మల్దకల్, గట్టు, గద్వాల తదితర మండలాల పరిధిలోని సీడ్ పంటలు మొత్తం తొలగిస్తున్నారు. 30 ఏళ్లుగా సాగు చేసుకుంటున్న తమకు ప్రభుత్వం భరోసా కల్పించి బీమాతో పాటు వడ్డీలేని రుణాలు ఇచ్చి ఆదుకోవాలని సీడ్ రైతులు కోరుతున్నారు.

నిలువునా మునిగాం.. రైతులు

మే మాసంలో వేయాల్సిన విత్తనాలను కంపెనీల మాటలు నమ్మి ఏప్రిల్‌లోనే వేశాం. అధిక ఉష్ణోగ్రతలతో పాటు నకిలీ విత్తనాల వల్ల నిలువునా మునిగాం. కంపెనీలు ఆదుకోకపోతే మా బతుకులు ఆగమే. ఎకరాకు రెండున్నర లక్షల ఖర్చు అయింది. అప్పులు మొత్తం మాపీ చేయాలి. లేదంటే బతికే పరిస్థితి లేదు.

సీడ్ విత్తన రైతులను ఆదుకోవాలి

నర్సింహా, రైతు సంఘం జిల్లా కార్యదర్శి, గద్వాల

గద్వాల ప్రాంతంలో సీడ్ రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇటు ఆర్గనైజర్లు, అటు కంపెనీల మధ్య నలిగిపోతున్నారు. ప్రభుత్వం వీరికి బీమా కల్పించడం లేదు. కంపెనీలు ఉచిత విత్తనాలు, వడ్డీలేని రుణాలు ఇవ్వాలి. నష్టం జరిగితే బీమా సౌకర్యం కల్పించాలి. ఈ ఏడాది జరిగిన నష్టాన్ని కంపెనీ యజమానులే భరించాలి. లేనిచో ఆందోళన చేపడతాం.

సెప్టెంబర్ 2 నుంచి ఎంసెట్ బైపిసి కౌన్సెలింగ్

- 4, 5 తేదీల్లో ధ్రువపత్రాల పరిశీలన
- 7 వరకు వెబ్‌ఆప్షన్ల నమోదు
- 11న తొలివిడత సీట్ల కేటాయింపు
- షెడ్యూల్ విడుదల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో 2023-24 విద్యాసంవత్సరానికి సంబంధించి బి ఫార్మసీ, ఫార్మా-డి, బయోటెక్నాలజీ, ఫార్మా సూటికల్ ఇంజినీరింగ్, బయోమెడికల్ ఇంజినీరింగ్, బయో టెక్నాలజీ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఎంసెట్ బైపిసి విద్యార్థులకు సెప్టెంబర్ రెండో తేదీ నుంచి కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభం కానుంది. ఈ మేరకు సాంకేతిక విద్యాశాఖ కమిషనర్, ఎంసెట్ ప్రవేశాల కన్వీనర్ వాకాటి కరుణ గురువారం షెడ్యూల్‌ను విడుదల చేశారు. సెప్టెంబర్ రెండు నుంచి మూడు వరకు ఆన్‌లైన్‌లో ప్రాథమిక సమాచారం అందుబాటులో ఉంటుందనీ, ప్రాసెసింగ్ ఫీజు చెల్లించాలనీ, హెల్ప్‌లైన్ సెంటర్లలో ధ్రువపత్రాల పరిశీలనకు వెళ్లేందుకు స్లాట్ బుకింగ్ చేసుకోవాలని సూచించారు. అదే నెల నాలుగు, ఐదు తేదీల్లో ధ్రువపత్రాల పరిశీలన ఉంటుందని తెలిపారు. ఆ నెల నాలుగు నుంచి ఏడు వరకు వెబ్‌ఆప్షన్ల నమోదుకు అవకాశముంటుందని వివరించారు. సెప్టెంబర్ 11న తొలివిడత కౌన్సెలింగ్ ద్వారా అభ్యర్థులకు సీట్లు కేటాయిస్తామని పేర్కొన్నారు. అదే నెల 11 నుంచి 14 వరకు ట్యూషన్ ఫీజు చెల్లింపు, ఆన్‌లైన్ ద్వారా సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుందని వివరించారు. సెప్టెంబర్ 17 నుంచి తుదివిడత కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు. 17న ఆన్‌లైన్‌లో ప్రాథమిక సమాచారం అందుబాటులో ఉంటుందనీ, ప్రాసెసింగ్ ఫీజు చెల్లించాలనీ, హెల్ప్‌లైన్ సెంటర్లలో ధ్రువపత్రాల పరిశీలనకు వెళ్లేందుకు స్లాట్ బుకింగ్ చేసుకోవాలని సూచించారు. 18న ధ్రువపత్రాల పరిశీలన జరుగుతుందనీ, 17 నుంచి 19 వరకు వెబ్‌ఆప్షన్లు నమోదు చేయాలని కోరారు. 23న తుదివిడత కౌన్సెలింగ్‌లో సీట్లు కేటాయిస్తామని వివరించారు. అదేనెల 23 నుంచి 25 వరకు ట్యూషన్ ఫీజు చెల్లించాలనీ, వెబ్‌సైట్ ద్వారా సెల్ఫ్‌రిపోర్టింగ్ చేయాలని కోరారు. 23 నుంచి 26 వరకు కేటాయించిన కాలేజీల్లో అభ్యర్థులు రిపోర్టు చేయాలని సూచించారు. ఇతర వివరాలు, సమాచారం కోసం వచ్చేనెల 23 నుంచి https://tseamcetb.nic.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.

సెప్టెంబర్ 24న స్పాట్ అడ్మిషన్ల మార్గదర్శకాలు

ప్రయివేటు ఇంజినీరింగ్, ఫార్మసీ కాలేజీల్లో ఎంసెట్ బైపీసీ విద్యార్థుల స్పాట్ అడ్మిషన్లకు సంబంధించిన మార్గదర్శకాలను సెప్టెంబర్ 24న విడుదల చేస్తామని వాకాటి కరుణ తెలిపారు. ఇతర వివరాల కోసం https://tseamcetb.nic.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.



వ్యవసాయ కార్మికుల కనీస వేతనాలు పెంచాలి

- సంబంధిత జిఒను వెంటనే సమీక్షించాలి
- కార్మికశాఖ కార్యాలయం వద్ద ధర్నాలో ఆర్.వెంకట్రాములు
- ఎస్‌వికె నుంచి లేబర్ ఆఫీసు వరకు భారీ ర్యాలీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో వ్యవసాయ కార్మికుల వేతనాలు పెంచాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఆ సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని సుందరయ్య పార్కు నుంచి ఆర్‌టిసి క్రాస్ రోడ్డులోని లేబర్ కమిషనర్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం రాష్ట్ర ఉపాధ్యక్షులు బుర్రి ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ధర్నాలో ఆయన మాట్లాడుతూ నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరగడంతో వ్యవసాయ కార్మికుల జీవనం దుర్భరంగా మారిందన్నారు. రోజుకూలి రూ.200-300 ఉందని, రెండేండ్లకొకసారి కనీస వేతనాలు పెంచాల్సిన రాష్ట్ర ప్రభుత్వం తొమ్మిదేండ్లుగా సమీక్షించకపోవడం దుర్మార్గమని అన్నారు. విద్య, వైద్యం, తదితర ఖర్చులు పెరిగాయని, కనీస వేతనాల జిఒను సమీక్షించి రోజుకు రూ.600 ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికశాఖ కమిషనర్ ద్వారా గ్రామాల్లో పోస్టర్లు, కరపత్రాలు వేసి, మైకుల ద్వారా విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని కోరారు. వ్యవసాయ కార్మికుల భద్రతకు సమగ్ర చట్టం చేయాలని, బీమా సౌకర్యం కల్పించాలని అన్నారు. సంక్షేమ పథకాలు, ఇళ్ల స్థలాలు, ఇళ్లు మంజూరులోనూ అన్యాయం జరుగుతోందని వాపోయారు. రెక్కల కష్టంతో జీవనం సాగిస్తున్న వ్యవసాయ కార్మికులకు సంక్షేమ పథకాల్లో మొదటి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అనంతరం డిప్యూటీ లేబర్ కమిషనర్‌కు మెమోరాండం అందజేశారు. ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఆయన హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం మహిళా కన్వీనర్ బి.పద్మ, రాష్ట్ర కార్యదర్శులు పొన్నం వెంకటేశ్వరరావు, పెద్ది వెంకట్రాములు, ఎం.ఆంజనేయులు, ఆర్.శశిధర్, ఎం.నర్సింహులు, ఎం.రాములు, ఎం.వెంకటయ్య, యు.గోపాల్, లంక రాఘవులు, అల్వాల వీరయ్య, కందుకూరి జగన్, సాంబశివ, సమ్మయ్య, జిల్లా కార్యదర్శులు రేపాకుల శ్రీనివాస్, కె.మల్లేష్, నర్సింహులు, ఆర్. దేవదాసు, డి.సరోజ, ఆర్.ఆంజనేయులు పాల్గొన్నారు.

ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ పర్యటనకు ఎమ్మెల్సీ కవిత

- 15న బ్రిస్బేన్, 16న అక్లాండ్‌లో బోనాల పండుగ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

బోనాల పండుగ ఉత్సవాల్లో పాల్గొనేందుకు ఎమ్మెల్సీ కవిత ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ పర్యటనకు వెళ్లారు. ఈ నెల 15న ఆస్ట్రేలియాలోని బ్రిస్బేన్‌లో "భారత జాగృతి ఆస్ట్రేలియా" ఆధ్వర్యంలో గాయత్రి మందిరంలో బోనాలు సంబరాలు జరగనున్నాయి. ఆ వేడుకలలో ప్రవాస భారతీయులతోపాటు ఆస్ట్రేలియా మంత్రులు, ఎంపిలు హాజరుకానున్నారు. 16న న్యూజిలాండ్‌లోని ఆక్లాండ్ నగరంలో గణేష్ టెంపుల్‌లో జరగనున్న బోనాలు వేడుకలో పాల్గొంటారు. న్యూజిలాండ్ తెలంగాణ సెంట్రల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరగనున్న ఈ బోనాలు వేడుకలకు ఏర్పాట్లు చురుకుగా జరుగుతున్నాయి. అలాగే ఆక్లాండ్‌లో వివిధ రాష్ట్రాల ఎన్నారైలు ఏర్పాటు చేసిన ప్రవాస భారతీయ సమ్మేళనంలో, తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ న్యూజిలాండ్ ఏర్పాటు చేసిన మీట్ అండ్ గ్రీట్‌లో పాల్గొంటారు.

24న కలెక్టరేట్ల ముందు ధర్నాలు : టిఎంకెఎంకెఎస్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యల సాధన కోసం ఈ నెల 24న అన్ని కలెక్టరేట్ల ముందు ధర్నాలు చేపట్టాలని తెలంగాణ మత్స్యకారులు మత్స్య కార్మిక సంఘం (టిఎంకెఎంకెఎస్) పిలుపునిచ్చింది. గురువారం ఆ సంఘం రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ సమావేశం ఆన్‌లైన్‌లో రాష్ట్ర అధ్యక్షులు గోరింకల నర్సింహ్మా అధ్యక్షతన జరిగింది. పలు సమస్యలపై ఆందోళనా, పోరాటాలు నిర్వహించాలని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెల్లెల బాలకష్ణ పేర్కొన్నారు. మత్స్యకారుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర మత్స్య శాఖ అడిషనల్ కమిషనర్ శంకర్‌రాథోడ్‌కు వినతి పత్రం సమర్పించారు. మత్స్యకారులకు 90 శాతం సబ్సిడీతో అన్ని రకాల వాహనాలు, వృత్తి పరికరాలు ఇవ్వాలనీ, డిఎఫ్‌సిఎస్ ఎన్నికల్లో రాష్ట్ర ప్రభుత్వం స్పెషల్ డ్రైవ్‌లో ఏర్పాటైన నూతన సొసైటీలకు ఎన్నికలు నిర్వహించాలని పేర్కొన్నారు.

ఉచిత చేపపిల్లలు తమకు వద్దనీ, మత్స్య సొసైటీ బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేయాలని కోరారు. ప్రతి మత్స్యకారునికి వ్యక్తిగతంగా రూ.5 లక్షలు, ప్రతి మత్స్యసొసైటీకి రూ.10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ ఏడాది మత్స్య సొసైటీలకు ఉచిత చేప, రొయ్య పిల్లల పంపిణీ కోసం రూ.110 కోట్లతో టెండర్లు పిలిచే ప్రక్రియను వ్యతిరేకిస్తున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు చనమాని శంకర్, ముర విజయ్, రాష్ట్ర కార్యదర్శులు కర్రెల్లి లలిత, కొప్పు పద్మ, గొడుగు వెంకట్, తెలు ఇస్తారి, బోడంకి చందు, మునిగేల రమేష్ తదితరులు ఉన్నారు.